


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం అక్టోబరు 24 2025 | సంపుటి : 2 | సంచిక : 21 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## మలేసియాలో మోదీ- ట్రంప్ భేటీ లేదు



**మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు ఆసియాన్ సదస్సు జరగనుంది.**

అయితే, ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడం లేదు. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మోదీల మధ్య భేటీ లేనట్లే.
షెడ్యూల్ సమస్యల వల్లే మోదీ ఇందులో పాల్గొనలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో మోదీకి బదులుగా విదేశాంగ మంత్రి జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తాజాగా ధ్రువీకరించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. అక్కడ జరగనున్న ఆసియాన్ సదస్సుల్లో వర్చువల్‌గా పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పేజి 2లో

## మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్



బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న వేళ.. మహాగట్ బంధన్ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఏకాభిప్రాయం కుదిరింది. తేజస్వీ యాదవ్ వైపే భాగస్వామ్య పార్టీలు మొగ్గుచూపాయి . ఆయన నాయకత్వంలో ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. పేజి 2లో

## సేల్స్‌మ్యాన్ నుంచి డిప్యూటీ సీఎం అభ్యర్థిగా.. ఎవరీ 'వీఐపీ' సహనీ?



బిహార్‌లో సీట్ల సర్దుబాటుపై మల్లగుల్లాలు పడిన విపక్ష ఇండియా కూటమి ఎట్టకేలకు ఓ నిర్ణయానికి వచ్చింది. సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థులనూ ప్రకటించింది. ఈ క్రమంలో వెనుకబడిన వర్గానికి చెందిన ఓ యువ నేతను డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఆ సామాజిక వర్గాన్ని తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసింది. పేజి 2లో




## స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత..

### తెలంగాణ కేబినెట్ నిర్ణయం

హైదరాబాద్: స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. అందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లో సెక్షన్ 21(3)ని తొలిగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్డినెన్స్ ద్వారా పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ చేయనున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పునరుద్ధరణపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



## అమరావతిలో జనవరి నుంచి క్వాంటం కంప్యూటింగ్ సేవలు: సీఎం చంద్రబాబు




**యూఏఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అబుదాబీలో వివిధ ప్రతినిధులతో సమావేశమయ్యారు.**

- **అబుదాబీ ఛాంబర్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈవో మాన్సూరీతో భేటీ అయ్యారు.**
- **ఆంధ్రప్రదేశ్ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా పయనిస్తోందని వివరించారు.**
- **రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.**



యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు అబుదాబీలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. అబుదాబీ ఛాంబర్ ఛైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈవో మాన్సూరీతో సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని చెప్పారు.రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయన్న సీఎం.. అమరావతి కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఉంటుందని వివరించారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో త్వరలో పర్యటిస్తామని, పెట్టుబడులపై ఆలోచన చేస్తామని ప్రతినిధులు చెప్పారు. అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతోనూ సీఎం భేటీ అయ్యారు. భారతదేశంలో తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు ఏడీఎన్ఓసీ ఆసక్తి చూపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను సీఎం వివరించారు. దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన వ్యూహాత్మక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. పెట్రో కెమికల్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని వివరించారు. అబుదాబీలోని పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి బృందం నెట్‌వర్క్ లంచ్‌లో పాల్గొంది.



2 లో

## స్నేహం అంటే అత్యాచారానికి లైసెన్స్ కాదు..!



## నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయాలు: పవన్ కల్యాణ్

అమరావతి: స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్లస్టర్ విధానం రద్దు చేసి.. 13,351 పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా చేసినట్లు చెప్పారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల వారికి మెరుగైన సేవలు అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. పంచాయతీల పాలన సంస్కరణల ఫలితాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్ కి సహకారం అందించండి



2 లో

## కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్: మంత్రి అనగాని సత్యప్రసాద్



2 లో


## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేసీఆర్



2 లో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

## మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొస్తాం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



2 లో

## తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు



2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబరు 24 2025

# హమాస్ దుర్మార్గం ఇజ్రాయెల్ అమానుషం



అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోత. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను%-% వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా%-% మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది. 'హమాస్' అనే పేరు 'హరఖత్ అల్ ముఖవా అల్ ఇస్లామియా' అన్న పూర్తిపేరుకు క్లుప్తపదం. దీనికి అర్థం 'ఇస్లామిక్ ప్రతిఘటన ఉద్యమం' అని. ఈ సంస్థ ఫండమెంటల్ స్వభావం కలిగినది. యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచన ఉద్యమంలో భాగంగా ఏర్పడిన పార్టీ 'ఫతా'. ఈ ఫతా పార్టీ పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌ను పాలిస్తుంది. ఫతా పార్టీ ఆదర్శం ఒక సర్వసత్తాక, గణతంత్ర, లౌకిక పాలస్తీనాను ఏర్పరచడం.

అయితే హమాస్ భావజాలం అందుకు భిన్నమైనది. కేవలం ఇస్లాం మత సౌభ్రాతృత్వంతో కూడిన పాలస్తీనాను ఏర్పరచడమే దాని ఆదర్శం. ఆ సంస్థ 1988లో తన శాసనావళిలో స్పష్టంగా%-% ఇజ్రాయెల్‌ను తుడిచిపెట్టేసి జోర్డాన్ నది నుంచి మధ్యధరా సముద్రం దాకా పాలస్తీనా 'ఇస్లామిక్' సామ్రాజ్యాన్ని ఏర్పరచడం తన ఆదర్శమని రాసుకున్నది. హమాస్ ఇంతటి స్పష్టమైన ఉద్దేశంతో ఏర్పడటంతో సహజంగానే ఇజ్రాయెల్‌లో దీనిపట్ల అప్రమత్తత నెలకొన్నది. 2007 ఎన్నికల్లో ఫతా పార్టీని హమాస్ గాజాలో ఓడించింది (132 సీట్లకు గాను 74 సీట్లు గెలుచుకుంది). ఆ తర్వాత ఫతా సంస్థపై దాడులు, హత్యలు, చిత్రహింసలతో విరుచుకుపడింది. చివరకు ఆ ప్రాంతంలో తానే ఏకైక పార్టీగా మిగిలి, అధికారం చెలాయిస్తూ వచ్చింది. మిలిటరీ హత్యాకాండను నమ్ముతూ, తమను రూపుమాపే లక్ష్యంతో ఉన్న హమాస్ అధికారంలోకి రావటంతో సహజంగానే ఇజ్రాయెల్ 2007 తర్వాత గాజా చుట్టూ ఒక పూర్తి నిర్బంధ స్థితిని తీసుకువచ్చింది. అంతవరకు అమెరికా, యూరోప్‌ల నుంచి మిలియన్ డాలర్లలో అందే ఆర్థిక సహాయం కూడా నిలిచిపోయింది. హమాస్ ఒక విముక్తి పోరాట సంస్థ అని చెప్పే వాళ్ళకు విప్లవం ఎలా ఉంటుందో తెలియకపోయి ఉండాలి, లేదా అది 'ఫాల్స్ గ్లోరిఫికేషన్' ద్వారా సమర్థించడం అయినా అయి ఉండాలి. మన దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పార్లమెంట్‌లో బాంబులు వేసాడు గాని, వెళ్ళి బ్రిటిష్ కుటుంబంలో చిన్నపిల్లల మీద, ఇంట్లో స్త్రీల మీద బాంబు వేయలేదు. మన దేశంలో మిలిటరీ విముక్తి పోరాటం చేస్తోందని చెప్పుకునే అతి పెద్ద సాయుధ పోరాట మావోయిస్ట్ సంస్థ కూడా ఇందులో కనీసం ఒకటవ వంతు హత్యాకాండకు కూడా పాల్పడలేదు. కేవలం మిలిటరీ పైన, పోలీసుల పైన, అధికార యంత్రాంగం పైన మాత్రమే దాడులు చేయడం అన్నది%-% ఏ విముక్తి పోరాటం అయినా పాటించే ఒక అలిఖిత యుద్ధ న్యాయం. నక్సలైట్లు భూస్వాముల ఇళ్ళల్లోకి ప్రవేశించి భూస్వాములను చంపిన సందర్భాలు ఉన్నాయి కానీ, వాళ్ళ ఇంట్లో భార్యలను చెరచడం, పిల్లల్ని తగలబెట్టడం జరగలేదు. హింసను అంగీకరించడం అంగీకరించకపోవడం అది వేరే చర్చ.

ఏ దిశా లేని హింస అన్నది కేవలం టెర్రరిజం మాత్రమే! అయితే హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం. హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందన మరింత అమానుషం! అందులో '%జూతీశీజూశీతీఱశీఅఖ్వ తీవంజూశీఅంవ%' అన్నది లేదు. హమాస్ సభ్యులు ఇళ్ళ కింద, హాస్పిటల్స్ కింద టన్నెల్స్‌లోనూ దాక్కున్నారని చెప్పి ఇజ్రాయెల్ ఎడాపెడా హాస్పిటళ్లను, స్కూళ్లను పేల్చివేస్తుంటే మానవ సమాజం యావత్తూ సాక్షులుగా మిగిలిపోవాల్సి రావటం దారుణమైన స్థితి! ప్రపంచంలోనే అతిపెద్ద, అతిశక్తిమంతమైన సీక్రెట్ ఏజెన్సీగా పేరుమోసిన ఇజ్రాయెల్‌కి చెందిన 'మొసాద్' కూడా అక్టోబర్ దాడిని పసిగట్టలేకపోయిందంటే ఎంత సిగ్గుమాలిన విషయం! దాడి జరిగిన తర్వాత బందీలు ఎక్కడున్నారో, హమాస్ మిలిటెంట్లు ఎక్కడున్నారో కూడా ఆ ఏజెన్సీ పసిగట్టలేకపోయింది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ఎయిర్ స్ట్రైక్స్ చేసి 67,000 మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుంది. ఇందులో 70 శాతం స్త్రీలు, పిల్లలు ఉన్నారు! అందులో హమాస్ మిలిటెంట్స్ 20 శాతం కూడా లేరు అని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెప్తున్నాయి.

ఇజ్రాయెల్ ఇది 'కొలేటరల్ డ్యామేజ్' అని నచ్చచెప్తోంది. తమాషా ఏమంటే%-% 'ఇదంతా ఒట్టి కొలేటరల్ డ్యామేజ్ మాత్రమే! మెయిన్ డ్యామేజ్ అతి స్వల్పం! అంటే ఒక్క మిలిటెంట్‌ను చంపాలంటే నలుగురు సాధారణ పౌరులను చంపవచ్చు' అని ఇజ్రాయెల్ ఇక్కడ తీర్మానిస్తున్నది. ఇన్ని యుద్ధాలు జరిగిన ఈ భూ ఖండంలో ఇంత అమానుషంగా, ఇంత స్థాయిలో, ఇంత disproportionate గా సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయింది లేదు (నాగసాకి, హిరోషిమా బాంబ్ ఘటన మినహాయిస్తే). నేడు సామ్రాజ్య వాదానికి, ఇస్లామిక్ విస్తరణ వాదానికి మధ్యలో నలిగిపోతున్నది ప్రపంచం. ఒకరు ఆస్తుల గురించి రాజకీయాలు చేస్తే, మరొకరు తమ మత విశ్వాసం వ్యాప్తి కోసం, మూఢులైన ప్రజల్లో తమ అధికార ప్రాబల్యం కోసం మానవ సమాజ వినాశనానికి పాల్పడుతున్నారు. ఒక తోడేలుకీ, ఒక పులికీ మధ్య చిక్కుకున్న గొర్రెపిల్ల పాలస్తీనా! ఫతా పార్టీ పూర్తిగా విఫలం కావడంతో దిక్కు తోచని పాలస్తీనా ప్రజలు హమాస్ వెనుక గుడ్డిగా తరలివెళ్ళారు. అందుకు మతం అనే సెంటిమెంట్ బలంగా పనిచేసింది. ఇజ్రాయెల్ బోర్డర్ కంట్రోల్ పేరుతో చెక్ పాయింట్స్ పెట్టి పాలస్తీనా ప్రజలను విపరీతమైన వ్యధకు గురిచేసింది.

ప్రజల్లో ఉండే కసిని హమాస్ చాలా తప్పుదారిలో నడిపి మరింత క్లిష్టమైన పరిస్థితి తీసుకువచ్చింది. తమ పౌరులను హమాస్ బందీలుగా చేసుకుందన్న కారణంతో పాలస్తీనాలోని సాధారణ ప్రజలను ఇజ్రాయెల్ చంపుతున్నది. దీన్ని ఎవరన్నా యుద్ధం అని నిర్వచిస్తే మనలో మానవ ఇంగితం లోపించినట్టే! పాలస్తీనా వేరు, హమాస్ వేరు! రగిలిపోయిన యూదుల కుటుంబాలు వేరు, వారికి జరుగుతున్న న్యాయం వేరు! ఒకటి దుర్మార్గం, మరొకటి అమానుషం!

## తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటి పేజీ తరువాయి

మెల్‌బోర్న్: తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు.

"జీడీపీలో తెలంగాణ వాటా 5శాతం, గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ.3.2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్ కి సహకారం అందించండి

మొదటి పేజీ తరువాయి

**రాష్ట్రాభివృద్ధి లక్ష్యసాధనకు ఏపీతో కలిసి పనిచేయండి**

**ఏఐ, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి**

**యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ ను సందర్శించిన మంత్రి నారా లోకేష్**

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్) ను సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్స్టన్, డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (గ్లోబల్, కల్చర్ అండ్ ఎంగేజ్ మెంట్) ప్రొఫెసర్ మైఖేల్ వెస్లీ, డీన్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ జెన్నీఫర్ బాలింట్, డీన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మారెక్ టెసార్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఐటీ ప్రొఫెసర్ అంపలవనపిళ్లై (థాస్) నిర్మలథాస్, డీన్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ మోయిరా ఓ'బ్రియన్ తదితర ఎగ్జిక్యూటివ్ లు లోకేష్ కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్వాంటమ్ పరిశోధనలు, ఉపాధ్యాయ శిక్షణపై వర్సిటీ ఉన్నతస్థాయి బృందంతో మంత్రి లోకేష్ చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం, విశ్వ విద్యాలయాలతో కలిసి కృత్రిమ మేధస్సు (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి అధునాతన సాంకేతికలపై స్థిరమైన పద్ధతుల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని కోరారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్ కు సహకరించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో రెన్యువబుల్ ఎనర్జీ, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో సంయుక్త పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భాగస్వామ్యం వహించండి. పంట దిగుబడులు, వాటర్ మేనేజ్ మెంట్, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడంపై ఏపీలోని ఆచార్య ఎన్ జి రంగా విశ్వవిద్యాలయంతో కలిసి పరస్పర సహకారంతో పరిశోధనలు నిర్వహించండి. స్థానిక సంస్థలను భాగస్వాములుగా చేసి డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్, టెలీ మెడిసిన్ ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపర్చేందుకు సహకారం అందించండి. స్మార్ట్ సిటీ ప్లానింగ్, వ్యర్థ నిర్వహణ, పునరుత్పాదక శక్తి రంగాల్లో నైపుణ్యాలను పంచి ఆంధ్రప్రదేశ్ పట్టణ అభివృద్ధి లక్ష్యాల సాధనకు మద్దతుగా నిలవాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## స్నేహం అంటే అత్యాచారానికి లైసెన్స్ కాదు..!

మొదటి పేజీ తరువాయి

పోక్సో కేసు విచారణలో భాగంగా దిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. స్నేహం అంటే అత్యాచారం చేయడానికి లైసెన్స్ కాదని పేర్కొంది. తామిద్దరం స్నేహితులమని పేర్కొంటూ.. నిందితుడు ముందస్తు బెయిల్ కోరిన నేపథ్యంలో కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

మైనర్ అయిన బాధితురాలు చేసిన ఫిర్యాదు ప్రకారం.. కొన్నేళ్లుగా నిందితుడితో ఆమెకు పరిచయం ఉంది. ఆమెను అతడు తన స్నేహితుడి ఇంట్లో బంధించి, కొట్టి, లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. అయితే తామిద్దరం ఇష్టపూర్వకంగా ఆ బంధాన్ని కొనసాగించామని, ఎఫ్ఐఆర్ నమోదులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నిందితుడు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు.

గతంలోనూ నాలుగుసార్లు ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరించినప్పటికీ.. అతడు విచారణలో భాగం కాకపోవడాన్ని ప్రశ్నించారు. "బాధితురాలు, నిందితుడు స్నేహితులే అయినప్పటికీ.. బాధితురాలిపై పదేపదే అత్యాచారం చేయడానికి, స్నేహితుడి ఇంట్లో బంధించేందుకు, కనికరం లేకుండా కొట్టేందుకు స్నేహం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్ నమోదు అలస్యమైందంటూ నిందితుడు చేసిన వ్యాఖ్యను తోసిపుచ్చింది. "భయం, తన మనసుకు తగిలిన గాయం కారణంగా ఈ ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పడానికి బాధితురాలు సంకోచించడం సహజమే" అని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణల తీవ్రత దృష్ట్యా బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది.

ఆయనే వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ వ్యవస్థాపకుడు 'ముకేశ్ సహనీ'. కొన్నేళ్ల క్రితం రాష్ట్ర రాజకీయాల్లో దూకుడుగా వ్యవహరించిన ఆయన .. విపక్షం తరఫున మరోసారి కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యారు.

**ఎవరీ సహనీ..?**

ముకేశ్ సహనీ దర్భంగాలో ఓ మత్స్యకారుల కుటుంబంలో 1981లో జన్మించారు. 19వ ఏట ముంబయికి వెళ్లి సేల్స్‌మ్యాన్‌గా పనిచేసిన ఆయన.. కొంతకాలానికి స్టేజ్ డిజైనర్‌గా బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ముకేశ్ సినీవరల్డ్ పేరుతో ఓ చిన్న కంపెనీని స్థాపించి సినీ పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్నారు. నిషాద్ (పడవలు నడిపే, జాలర్లు) వర్గానికి చెందిన ఈయన.. పట్నా, దర్భంగాలలో పలు సేవా కార్యక్రమాలు మొదలుపెట్టి తన సామాజిక వర్గం 'మల్లా కుమారుడు' (%వాశీఅ శీట మీఙ్రీశ్రీఖష్ట్ర%)గా తనదైన ముద్ర వేసుకున్నారు. మల్లా.. నిషాద్ వర్గంలో ఉప కులంగా ఉంది. రాష్ట్రంలో నిషాద్‌ల జనాభా 9.6శాతంగా ఉండగా, సహనీకి చెందిన మల్లాలు 2.6శాతంగా ఉన్నట్లు అంచనా.

**కాషాయ ఆగ్రహానికి గురై..**

ప్రధాని మోదీ చొరవతో 2015 అసెంబ్లీ ఎన్నికల సమయంలో భాజపాకు మద్దతుగా ప్రచారం చేసిన సహనీ.. తదనంతరం నిషాద్ వర్గ నాయకుడిగా ఎదిగారు. అయితే, తమ వర్గానికి ఎస్సీ హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో కాషాయ పార్టీకి ఆయన దూరమయ్యారు. అదే ఏడాది నిషాద్ వికాస్ సంఘ్ పేరుతో తన సామాజిక వర్గాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నం చేశారు. 2018లో వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ (%ఎఖ్రా%)ని స్థాపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌లో చేరి పోటీ చేసినప్పటికీ ఖాతా తెరవలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎన్డీయే కూటమి తరఫున పోటీ చేయగా.. వీఐపీ తరఫున నలుగురు అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో ఓడిపోయిన సహనీకి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన భాజపా.. పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పదవి అప్పగించింది. అయితే, ఆ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే మరణించడం, మరో ముగ్గురు 2022లో భాజపాలో చేరిపోవడంతో పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. సహనీ ఎమ్మెల్సీ పదవి కూడా ముగియడం, మరోసారి భాజపా అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన మంత్రి పదవికి దూరమయ్యారు.

**అదే వ్యూహం..**

మహాగఠ్‌బంధన్‌లో ప్రధాన పార్టీలుగా ఉన్న ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (ఎంఎల్) లిబరేషన్‌లు సీట్ల పంపకాల కోసం కుస్తీ పడ్డాయి. ఈ నేపథ్యంలో నిషాద్ వర్గానికి మరింత చేరువయ్యేందుకు ప్రయత్నించిన విపక్ష కూటమి.. వీఐపీని తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉప ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం ద్వారా గతంలో ఎన్డీయే వైపు మొగ్గు చూపిన ఈ వర్గం ఓటర్లు ఈసారి తమకు మద్దతుగా నిలుస్తారని విపక్ష ఇండియా కూటమి ఆశిస్తోంది.

## మలేసియాలో మోదీ- ట్రంప్ భేటీ లేదు

మొదటి పేజీ తరువాయి

ఈ ఆసియాన్– భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతానికి ఎదురుచూస్తున్నట్లు రాసుకొచ్చారు. ఈ సదస్సుకు వెళ్లని నేపథ్యంలో కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఇక, ఈ సదస్సుకు ట్రంప్‌తో సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. భారత ప్రధాని గైర్హాజరు నేపథ్యంలో మోదీ, ట్రంప్‌ల భేటీ కూడా జరగదు.

భారత్, పాక్ సంబంధాలపై చర్చించాం

ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత్– ఆసియాన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా పెరిగాయి. వాణిజ్యం, పెట్టుబడి రంగాలతో పాటు భద్రత, రక్షణల్లో సహకారంపై దృష్టి సారించాయి.

## మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్

మొదటి పేజీ తరువాయి

సీఎం అభ్యర్థి గురించి గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. బిహార్ రాజధాని పట్నాలో దీనికి సంబంధించి మీడియా సమావేశం జరిగింది. "తేజస్వీయాదవ్ మా కూటమి అభ్యర్థి. మరి మీ అభ్యర్థి ఎవరు..?" అని ఎన్డీయేకు మహాగఠ్‌బంధన్ సవాల్ విసిరింది. సీఎం ఫేస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిని విపక్ష కూటమి ప్రకటించడం గమనార్హం. వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ వ్యవస్థాపకుడు ముకేశ్ సహనీ డిప్యూటీ సీఎం అభ్యర్థి అని కాంగ్రెస్ నేత అశోక్ గహ్లోత్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. ఈ ప్రెస్‌మీట్ పోస్టర్లలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫొటో కనిపించలేదు. కేవలం తేజస్వి ఫొటో మాత్రమే దర్శనమిచ్చింది. "ఇది సంయుక్త మీడియా సమావేశమా..? కానీ ఒక్క ఫొటోనే ఉంది. కాంగ్రెస్, రాహుల్‌కు వారి స్థానమేంటో చూపించారా..?" అని భాజపా వ్యంగ్యాస్త్రాలు విసిరింది.

కాగా.. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీకి దిగింది. ఆర్జేడీ 143 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా.. సీపీఐ తొమ్మిది, సీపీఐ (ఎం) నాలుగు స్థానాల్లో బరిలోకి దిగాయి. ఎనిమిది స్థానాల్లో.. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ఆయా స్థానాల్లో కూటమి అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది (%దీఅష్ఱుతీ ాాంంవఎశ్రీఎ జుశ్రీవఙ్ఱశీఅం%). ఈ పరిణామంతో కూటమిలో చీలిక వచ్చిందనే వదంతులకు బలం ఏర్పడింది. అయితే, కూటమి పార్టీలు తమలో తాము పోటీపడతాయా, సయోధ్య కుదుర్చుకొని ఉమ్మడి అభ్యర్థులను నిర్ణయిస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

## కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్: మంత్రి అనగాని సత్యప్రసాద్

మొదటి పేజీ తరువాయి

మంగళగిరి: కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగనే అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు అంత కోపం ఎందుకుని ప్రశ్నించారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

"రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కష్టపడుతున్నారు. విశాఖను ఐటీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నారు. వైకాపా నేత జోగి రమేశ్‌తో నకిలీ మద్యం కేసు నిందితుడు జనార్ధన్‌రావు మాట్లాడింది నిజం కాదా? తప్పు చేసినవారు ఎవరైనా మా పార్టీ ఊరుకోదు. మా పార్టీ నేతలు తప్పు చేసినా వెంటనే చర్యలు తీసుకుంటారు. నాణ్యమైన మద్యం సరఫరా చేసేందుకు మేం అనేక చర్యలు తీసుకున్నాం. జూదంపై జగన్ ఇప్పుడు మాట్లాడుతున్నారు.. మీ హయాంలో ఏం చేశారు? గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. మా నియోజకవర్గంలో జూదం జరుగుతోందని లేఖ రాస్తే కనీస స్పందనలేదు. జూదం ఎక్కడ జరిగినా కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుంది. పార్ట్‌టైమ్ విజిటర్‌గా వచ్చి మాపై దుష్ప్రచారం చేయడం తగదు" అని విమర్శించారు.

## మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొస్తాం

మొదటి పేజీ తరువాయి

శ్రీకాకుళం: పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లో ప్రవేశించి అక్కడి నేవీ అధికారులకు చిక్కిన విజయనగరం జిల్లా మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు చేరుస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ విషయంపై బుధవారం రాత్రి విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు బంగ్లాదేశ్ ఎంబసీ, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులు బుధవారం తెల్లవారుజామున బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని తిరిగి రప్పించేందుకు కేంద్రమంత్రి చర్యలు చేపట్టారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

ఎర్రవల్లి: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో దాదాపు రెండున్నర గంటలకుపైగా పార్టీ సీనియర్ నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఉప ఎన్నిక ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

"కాంగ్రెస్ బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఆగమైంది.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఆగమవుతున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముంది. ప్రజల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృతంగా చర్చ జరగాలి" అని కేసీఆర్ అన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## మూసారాంబాగ్ వద్ద మూసీపై పాత వంతెన కూల్చివేత

హైదరాబాద్: మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద ఉన్న పాత వంతెనను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఇటీవల మూసీ వరదలకు పాత వంతెన పూర్తిగా దెబ్బతిని రవాణాకు అనుకూలంగా లేకపోవడంతో గత కొన్ని రోజులుగా రాకపోకలు నిలిపివేశారు. వరద కారణంగా వంతెనకు క్రాక్స్ రావడం, రెయిలింగ్ పెచ్చులూడి పోవడం, అక్కడక్కడా ఇనుపరాడ్లు తేలి ప్రమాదకర స్థితిలో ఉండటంతో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వంతెను పూర్తిగా పరిశీలించి మూసివేశారు.

ట్రాఫిక్ పోలీసులు సైతం వంతెనపై రాకపోకలకు అనుమతులు నిలిపివేశారు. ఈ క్రమంలో ముందస్తుగా పాత వంతెనపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పూర్తిగా కూల్చివేస్తున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తగా మరో వంతెన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం అంబర్ పేట వైపు వెళ్లే వాహనాలను గోల్నాక వంతెన మీదుగా దారి మళ్లించారు. పాత వంతెన కూల్చివేతతో కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబరు 24 2025

## కాసా విశ్వనాథ్ అపార్ట్ మెంట్

# భూమిపూజ నేడు







» గుండ్ల పోచంపల్లి,హైద్రాబాద్ లో
» శ్రీనిక గ్రూప్ ద్వారా మరో ప్రాజెక్ట్

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్

హైదరాబాద్ గుండ్ల పోచంపల్లి లో "కాసా విశ్వనాథ్" పేరుతో గేటెడ్ కమ్యూనిటీ రెసిడెన్షియల్ అపార్ట్ మెంట్ భూమిపూజ ఈ రోజు 24 వ అక్టోబర్ తేదీన, ఉదయం 11 గంటలకు జరగనున్నదని నిర్వాహకులు చావా అజయ్, బైలె రాజేష్, పంపారి సంతోష్ తెలిపారు. నిర్మాణ రంగంలో ఉన్న శ్రీనిక గ్రూప్ సంస్థల నుండి మరో ప్రాజెక్ట్ ప్రారంభం కాబోతున్నదని అన్నారు.

మా శ్రీనిక గ్రూప్ సంస్థ "ఐతరేయ ఇన్ ఫ్రా LLP.. ఆధ్వర్యంలో నిర్మాణ మవుతున్న "కాసా విశ్వనాథ్" ప్రాజెక్ట్ భూమిపూజ కు ముఖ్య అతిథులుగా

» మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటెల రాజేందర్ గారు,
» మేడ్చల్ ఎమ్మెల్యే శ్రీ చామకూర మల్లారెడ్డి గారు,
» మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ మలిపెద్ది సుధీర్ రెడ్డి గారు,
» రామగుండం ఎమ్మెల్యే శ్రీ మఖాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు,
» అంబర్ పేట్ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేశ్ గారు,
» తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ ఈరవత్రి అనిల్ కుమార్ గారు,
» కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గారు,
» కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ శ్రీ జువ్వాడి నర్సింగ్ రావ్ గారు,
» తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ సురభి నవీన్ కుమార్ గారు హాజరవుతున్నారని తెలిపారు.




రణధీర్ వాసం పర్యవేక్షణలో, శివప్రసాద్ వాసం మార్గ దర్శనంలో హైదరాబాద్ లో పలు అపార్ట్ మెంట్లు,విల్లాలు,లే అవుట్ ప్రాజెక్ట్ పూర్తి చేసామని, ఇప్పుడు మా గ్రూప్ నుండి వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్ భూమిపూజ కార్యక్రమానికి రావలసిందిగా తమ కస్టమర్లకు, మిత్రులు శ్రేయోభిలాషులందరికీ పత్రికా ముఖంగా ఆహ్వానం పలుకుతున్నామని అజయ్, బైలె రాజేష్, పంపారి సంతోష్ లు సంయుక్తంగా తెలిపారు.

ఈ శుభ సందర్భంలో కస్టమర్లకు ఆఫర్ ప్రకటిస్తున్నామని,మా మార్కెటింగ్ చీఫ్ శ్రీ అమర్ గారిని ఫోన్ నంబర్ 90599 45994 పై సంప్రదించవచ్చని తెలిపారు.

# ఇందిరా పార్క్.. ధర్నా చౌక్

**వీవోఏ ల ధర్నాకు మద్దతు తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు**
**వీవోఏ ల హక్కుల సాధన కోసం లాఠీ దెబ్బలు తినేటందుకైనా సిద్ధం**
**వీవోఏల జీతం రూ.8 వేల నుంచి రూ.26 వేలకు పెంచాలి**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



కవిత మాట్లాడుతూ వీవోఏల హక్కుల సాధన కోసం లాఠీ దెబ్బలు తినేందుకైనా తాను సిద్ధమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారఇందిరాపార్క్ లోని ధర్నా చౌక్ లో వీవోఏలు చేపట్టిన ధర్నాలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారని పేర్కొన్నారు మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు VOA లకు 26 వేలు జీతం పెంచుతామని హామీ ఇచ్చారని అసలు అధికారంలోకి వస్తామని వారికే నమ్మకం లేకుండే. అందుకే ఇష్టానుసారం హామీలు ఇచ్చారని కానీ అనుకోకుండా తప్పుదారిన అధికారంలోకి వచ్చారని ఆరోపించారు ఇప్పుడు రేవంత్ రెడ్డికి ఇచ్చిన హామీలు గుర్తు లేవనిఆయనకు ఒక్క సోనియమ్మ తప్ప తెలంగాణ సోయి లేదు. జై తెలంగాణ అనకుండా జై సోనియమ్మ అంటున్నాడని సోనియమ్మ కాదు జీతాలు పెంచాలంటూ ధర్నా చేస్తున్న ఈ తల్లులను చూడాలని సీఎం ను కోరుతున్నా. 8 వేలు ఉన్న VOA ల జీతం రూ. 26 వేలు చేయాల్సిందే. వారి జీతం పెంచే వరకు వారికి జాగృతి అండగా ఉంటుందని అన్నారు VOA లు ఎన్నో పనులు చేస్తారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లలోని 64 లక్షల మందికి రూ.20 వేల కోట్ల రుణాలు అందించటంలో VOA లదే కీలక పాత్ర.అని ఈ ప్రభుత్వాన్ని జీతం పెంచమని వేడుకోవాల్సిన అవసరం లేదు. పిడికిలెత్తి డిమాండ్ చేయాల్సిందే. అని తెలిపారు VOA అక్కా చెల్లెళు భయం భయంగా ఆందోళనలు చేయాల్సిన పని లేదు. ధైర్యంగా నిరసన తెలుపాల్సిందే.అని మీరు లేకుంటే 64 లక్షల మంది సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లలో మహిళలు ఊరుకుంటారా? ఈ ప్రభుత్వం నడుస్తదా?

మీ శక్తిని మీరు తక్కువ అంచనా వేసుకోకండి. మీరు చేస్తున్న పనికి మాత్రమే సరైన వేతనం ఇవ్వాలని అడుగుతున్నారని ఇంత పనిచేస్తున్న మనకు ఎందుకు యూనిఫాం లేదు? ఏడాదికి కచ్చితంగా రెండు జతల యూనిఫాంలు ఇవ్వాల్సిందే. యూనిఫాం ఉంటే ఆ గౌరవం వేరే ఉంటుంది. మనం కోరుకుంటున్నది ఆత్మగౌరవం, సరైన వేతనం మాత్రమే. అని చెప్పారు మిమ్మల్ని ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడితే వారికి అండగా నేను ఉంటా.అని జీతం పెంచుతామని ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నా. ఈ ప్రభుత్వంVOA ఆడబిడ్డలను మాత్రమే కాదు. తెలంగాణలోని అందరూ మహిళలను మోసం చేసిందని విమర్శించారు వారికి ఇస్తా అన్న రూ. 2500 లేవు. పెన్షన్ పెంపు ఇప్పటికీ చేయలేదని కాంగ్రెస్ పార్టీ లో ఉన్నవాళ్లకు మాత్రమే ఇళ్లు ఇస్తున్నారని తెలంగాణలోని ప్రతి పేదవారికి ఇళ్లు ఇవ్వాల్సిందే. ఈ ప్రభుత్వం మొండి, మతిమరుపు, మోసపూరిత ప్రభుత్వం.అని మండిపడ్డారు అందుకే మన డిమాండ్ల కోసం గట్టిగా అడగాల్సిందే. VOA లు ఎలాంటి కార్యాచరణ తీసుకున్న సరే నేను ముందుంట. VOA ఆడబిడ్డలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా.అని పేర్కొన్నారు

# సింగరేణి కీలక ఖనిజ రంగంలో మరో ముందడుగు

**సింగరేణిలో అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధం**
**ఎన్.ఎఫ్.టి.డి.సి సంస్థ సాంకేతిక సహకారంతో ప్రయోగాత్మకంగా ప్లాంటు ఏర్పాటు**
**సింగరేణి ఓవర్ బర్డెన్, ఫ్లై యాష్, మట్టి, నిరుపయోగ మెటీరియల్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (అరుదైన కీలక ఖనిజాల) గుర్తింపు**
**త్వరలోనే పైలట్ ప్లాంటు నిర్మాణం: సీఎండీ ఎన్. బలరామ్.**



**హైదరాబాద్ అక్టోబర్ 23, కరపత్రం ప్రతినిధి**
సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కీలక ఖనిజ రంగంలో కూడా ప్రవేశించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ దిశగా మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి ప్రాంతంలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ గుర్తించి ఉత్పత్తి చేయడానికి ఒక ప్రయోగాత్మక ప్లాంటు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది.ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం కేంద్ర ప్రభుత్వ అధికారిక పరిశోధన సంస్థ ఎన్.ఎఫ్.టి.డి.సి (నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్ మెంట్ సెంటర్) తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్, ఎన్.ఎఫ్.టి.డి.సి నుంచి ఎన్ఎఫ్టిడీసీ డైరెక్టర్ బాలసుబ్రమణియన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ వివరాలను ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్. బలరామ్ వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలను మరింత వేగవంతం చేస్తుందని, దీనిలో భాగంగా సింగరేణి ప్రాంతంలో లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని తెలుసుకోవడానికి, లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను ఉత్పత్తి చేయడానికి ప్రయోగాత్మకంగా ఒక ప్లాంట్ ను కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన సాంకేతిక సహాయాన్ని ఎన్.ఎఫ్.టి.డి.సి సంస్థ నుంచి తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ లో సింగరేణి ఓవర్ బర్డెన్ మట్టిలో లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ తో పాటు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ లోను, ఇతర వేస్ట్ మెటీరియల్స్ లోను లభ్యమయ్యే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తిస్తామని, ప్రయోగాత్మకంగా వీటిని ఉత్పత్తి చేయడం కూడా జరుగుతుందన్నారు. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లభ్యతా శాతం, ఉత్పత్తికి గల అవకాశాలు, వ్యాపార కోణంలో లాభదాయకత తదితర విషయాలను దృష్టిలో పెట్టుకొని తదుపరి పెద్ద ఎత్తున ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.టి.డి.సి ఉన్నతాధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో తాము ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించామని, కొన్ని కీలక ఖనిజాలు ఓవర్ బర్డెన్ మట్టిలోనూ, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ లోను ఉన్నట్లు గుర్తించామని, కొత్తగా స్థాపించనున్న పైలట్ ప్లాంటు ద్వారా మరింత సమగ్రమైన సమాచారం లభించనుందన్నారు. సింగరేణి సంస్థతో కలిసి పనిచేయడం తమకెంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్రక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) శ్రీ టి. శ్రీనివాస్, జీఎం (బిజినెస్ డెవలప్మెంట్) రాందాస్, జీఎం (ఎక్స్ ప్లోరేషన్) శ్రీనివాసరావు, ఎన్.ఎఫ్.టి.డి.సి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.-చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్.

## కేసీఆర్ ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్ రెడ్డి.



**హైదరాబాద్ అక్టోబర్ 23 కరపత్రం ప్రతినిధి**
తన పుట్టినరోజు సందర్భంగాగురువారం అధినేత కేసీఆర్ ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్ రెడ్డి.
ఈ సందర్భంగా వారికి అధినేత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు

**నిజాయితీ, నిబద్దత, క్రమశిక్షణతో పనిచేయండి**
**రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లు**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ అక్టోబర్ 23 కరపత్రం ప్రతినిధి**



నీళ్లు..నిధులు.. నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా గ్రూప్-2 నియామకాలలో ఎంపికై స్టాంప్స్ %డ% రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్లుగా నియమితులైన 14మంది అధికారులు గురువారం రాష్ట్ర సచివాలయంలోని మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిని మంత్రిగారు అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి గారు కొత్తగా నియమితులైన సబ్ రిజిస్టర్లకు ఇండియన్ స్టాంప్ యాక్ట్ బుక్ లను అందజేశారు. మంత్రిగారు మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో నిరుద్యోగ యువత కన్నకలలు కల్లలై పోయాయని కొత్త ఉద్యోగాలను సృష్టించడం మాట అలా ఉంచితే , ఉద్యోగాల నియామక ప్రక్రియలలో గత ప్రభుత్వం చూపించిన అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత ఆశలు అడుగంటిపోయాయని విమర్శించారు. ఆనాటి ప్రభుత్వం చేపట్టిన అరకొర ఉద్యోగ నియామక ప్రక్రియలలో చోటు చేసుకున్న అక్రమాలు, పేపర్ లీకేజీలు, అసమర్ద పరీక్షా నిర్వహణ వల్ల అర్హులైన యువతకు ఉద్యోగాలు రాని పరిస్థితి దాపురించిందన్నారు.

ఈ పరిస్థితులలో ఇందిరమ్మ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అందువల్లే గత 20 నెలల పాలనా కాలంలో ఇప్పటి వరకు సుమారు 70 వేలకు పైగా ఉద్యోగాల భర్తీ జరిగిందని వివరించారు. అంతేగాక నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఆలోచన మేరకు వివిధ శాఖల తరపున కార్యాచరణను విస్తృతం చేశామని మంత్రి పొంగులేటి చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూ శాఖలో జీపీవోల నియామకం, హౌసింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్దతిలో దాదాపు 350 మంది ఇంజనీర్లు, సర్వే విభాగంలో 3465 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు.

కొత్తగా ఉద్యోగాలలో చేరే అధికారులు సామాన్య ప్రజలే లక్ష్యంగా సేవలు అందించాలని, తద్వారా ఉద్యోగానికి న్యాయం చేసి ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ చాలా జాగ్రత్తగా పనిచేయాల్సి ఉంటుందని, ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా నిజాయితీ, నిబద్దత అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసి ప్రభుత్వ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ లో అంతర పంటగా పసుపు సాగు చేసే అవకాశాము

**హైదరాబాద్ అక్టోబర్ 23**
**కరపత్రం ప్రతినిధి**



సెక్రెటరీయట్ లో మంత్రి తుమ్మల గారిని గురువారం మర్యాద పూర్వకంగా కలసిన పసుపు బోర్డ్ సెక్రెటరీ శ్రీమతి ఎన్. భవానీ
ఈ సందర్భముగా కొత్తగా ఏర్పాటైన పసుపు బోర్డు గత ఆరు నెలలుగా చేపట్టిన కార్యక్రమం వివరాలను మంత్రి గారికి వివరించిన బోర్డు సెక్రెటరీ
ఆయిల్ పామ్ లో అంతర పంటగా పసుపు సాగు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించిన మంత్రి తుమ్మల
ప్రస్తుతం సాగులో ఉన్న రకాలను బదులుగా అధికంగా కుర్క్ మిన్ ఉన్న రకాలను సాగు చేయించె విధంగా ప్రోత్సహించాలని కోరిన మంత్రి తుమ్మలపసుపు ఉత్పాదకాల మార్కెటింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందిగా సూచించిన మంత్రి తుమ్మల కోత అనంతరం ఉపయోగపడే పసుపు ఉడకబెట్టే యంత్రాలు , పాలిషర్స్ , గ్రైండర్లు లాంటి వాటిని రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలపిన సెక్రెటరీ పసుపు రైతు ఉత్పత్తి సంఘాలను గుర్తించి వారికి 23 లక్షల వరకు రాయితీ కల్పించి, కోత అనంతరం పసుపులో అవసరమయ్యే పనిముట్లను ,యంత్రాలను అందిస్తున్నట్లు తెలియచేసిన సెక్రెటరీరైతులకు IPM, పద్దతుల్లో , Organic Certification లో తోడ్పడుతున్నట్లు తెలపిన సెక్రెటరీప్రస్తుతం పసుపును powder రూపంలో ITC , పతాంజలి వంటి వివిద కంపెనీలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడి. తూర్పు , మద్యమ దేశాలకు సరఫరా చేసే ఒక ప్రముఖ కంపెనీ 10 ఎకరాల స్థలంలో ప్రాసెసింగ్ యూనిట్ కూడా నిజామాబాద్ లో స్థాపించడానికి ముందుకు వచ్చిందని గౌరవ మంత్రికి తెలియ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గారు మాట్లాడుతూ కుర్క్ మిన్ పసుపులో అధికంగా వచ్చే నూతన రకాల సాగు, పురుగు,కలుపు రకాల వినియోగం తగ్గించడం ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, ఆయిల్ పామ్ లో అంతర పంటగా పసుపు సాగు చేసే అవకాశాల్ని పరిశీలించాల్సిందిగా సూచించారు. పసుపు ఉత్పత్తులకు ఫార్మా మరియు ఆయుర్వేద రంగంలో ఉన్న అవసరాల దృష్ట్యా బోర్డు ద్వారా మార్కెటింగ్ లింకేజీలు కల్పించాలని కోరారు. ఆదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియచేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబరు 24 2025

# నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజు రెడ్డి

» శివంపేట మండలం నాయకులు సహకారంతో
» పిల్లుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు
» ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 23**
మెదక్ జిల్లామెదక్ జిల్లానార్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి మెదక్ జిల్లా శివంపేట మండలనాయకులు పులిమామిడి నవీన్ గుప్తా సహకారంతో శివంపేట మండల్ పిల్లుట్ల గ్రామానికి చెందిన పెద్దపులి మౌనిక రాము మంగళి స్వప్న శ్రీనివాస్ లకు ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ లెటర్ అందజేసిన పిల్లుట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవరెడ్డి యువ నాయకులు బొమ్మిడాల శంకర్ బుర్ర మురళి మంగళపర్తి స్వామి , ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంద్ర లక్ష్మయ్య, బుర్ర రామా గౌడ్, రామ్ రెడ్డి, గులేగారి రాములు, సాలే దశరథ, కృష్ణ,, బెస్త భద్రయ్య, బెస్త కిష్టయ్య, బబ్బురి మల్లేష్, ముప్పిడి సత్తయ్య, పిల్లి పెద్ద వెంకటయ్య, గాండ్ల అంజయ్య, గొల్ల అంజయ్య, గొల్ల రాములు, పిల్లి మధు, పిల్లి వెంకటయ్య పెద్దపల్లి సతీష్ తలారి హనుమంతు కొత్తపల్లి నాగేష్, రవీందర్, దినేష్ రెడ్డి, అందే నర్సింల్లు,పాల్గొన్నారు సుధాకర్, గొల్ల శ్రీశైలం, రంగప్ప బాలేష్, సంద్ర విష్ణు, బుర్ర వినయ్ కమ్మరి మధుసూదన్, గుర్రాల భూపాల్, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# రాజన్న ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు

- ఆశీర్వచనం అందించిన అర్చకులు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్,(ఇంచార్జ్ కలెక్టర్) గా బాధ్యతలు చేపట్టిన గరిమా అగ్రవాల్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అర్చకులు స్వస్తితో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మహా మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. అదనపు కలెక్టర్ దంపతులకు ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి, అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు ఆలయ అధికారులు తదితరులు ఉన్నారు.

# విధులు బహిష్కరించి, నిరసన తెలిపిన న్యాయవాదులు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
సిరిసిల్ల కోర్టు సీనియర్ న్యాయవాది వరద మారుతి పై ఈ నెల 17 న జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో న్యాయవాదులు జూనియర్, సీనియర్ కోర్టు విధులు బహిష్కరించి, కోర్టు ప్రధాన ద్వారం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ న్యాయవాదిపై దాడికి పాల్పడిన నిందితుల తరపున న్యాయవాదులు కోర్టులో వకాలాత్ దాఖలు చేయొద్దని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, రేగుల దేవేందర్, విద్యాసాగర్ రావు, పొత్తూరు అనిల్ కుమార్, పిట్టల మనోహర్, కమటం అంజయ్య, మాదాసు దేవయ్య, పర్లపెల్లి అంజయ్య, నక్క దివాకర్,నాగుల సంపత్ గౌడ్, గొంటి శంకర్, రేగుల రాజకుమార్, జెట్టి శేఖర్, భీమ మహేష్ బాబు, కనికరపు శ్రీనివాస్, వడ్లకొండ శ్రీకాంత్, యమ తిరుపతి, నేదురి అభిలాష్, గుడిపల్లి మహేష్, ఉల్లెందుల అనిల్, పొత్తూరి జనార్దన్ ,వెంకటేష్, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ, నాయిమా నాసారి, పడిగెల మమత, మొగిలి సుజాత పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన గరిమా అగ్రవాల్

- సెలవులో వెళ్లిన కలెక్టర్ ఎం హరిత
- ఇంచార్జ్ కలెక్టర్ గా కూడా బాధ్యతలు స్వీకరణ



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి అదనపు కలెక్టర్ చేరుకోగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఎం హరిత సెలవుపై వెళ్లగా, ఇంచార్జి కలెక్టర్ గా సైతం గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 908 కేజీల గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్ 23:**
నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.7 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. బహిరంగ మార్కెట్లో దీని ధర రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు.
ఏ 1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్ / గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ఏ 2 షేక్ సోహైల్, ఏ 3 మొహమ్మద్ అఫ్జల్ అబ్బులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రహమాన్, ఒడిస్సాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడుగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్ ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు.
గంజాయిని (28) హెచ్‌డీపీఈ సంచుల్లో నింపి, వాటిని జీడిపప్పు కింద దాచిపెట్టి టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ మీదుగా నాసిక్, మహారాష్ట్ర వైపు రవాణా చేస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన నిందితుడు సురేష్ ఒక్క ట్రిప్‌కు రూ. 3 నుంచి 5 లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేశాడని.. అందుకే గంజాయి సరఫరాకి దాంతో రెహమాన్ అంగీకరించాడన్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పేర్కొన్నారు.

# సాయి ఆశ్రమానికి పదివేల రూపాయల విలువగల సౌండ్ బాక్స్ బహూకరణ.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 23**
హుజురాబాద్ మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన దుబాసి సౌజన్య సురేష్ దంపతులు సింగరేణి సంస్థలో సౌజన్యకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా సాయి ఆశ్రమానికి పదివేల రూపాయల విలువగల సౌండ్ బాక్స్ సిస్టమును అందజేశారు. మా ఇందిరా నగర్ గ్రామానికి చెందిన
మా బావగారు దుబాసి మహేందర్ మా అక్కయ్య స్వరూప సలహా సూచన మేరకు ఆశ్రమంలో సౌండ్ బాక్స్ సిస్టం లేదని తెలుసుకొని, వారి సూచన మేరకు సౌండ్ బాక్స్ సిస్టమును ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చిరాములు కి అందజేశామని సౌజన్య తెలిపారు.
ఆశ్రమానికి సౌండ్ బాక్స్ సిస్టమును అందించిన దుబాసి సౌజన్య సురేష్ కు దీనికి సహకరించిన దుబాసి మహేందర్ స్వరూప కు మా పేరెంట్స్ కమిటీ



తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సూత్రపు బుచ్చి రాములు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరానగర్ మాజీ సర్పంచ్ సిరిమల్లె రాజు మాట్లాడుతూ మాట్లాడుతూ, మా ఇందిరా నగర్ గ్రామానికి సమీపాన ఉన్న ఆశ్రమానికి అన్ని రకాల చేయూత అందిస్తామని, దివ్యాంగ పిల్లలు భగవంతుని స్వరూపాలని, సౌండ్ బాక్స్ సిస్టం అందించిన దుబ్బాసి సౌజన్య, సురేష్ ను ఆయన అభినందించారు.
ఇందిరా నగర్కు చెందిన మేడద విద్యాసాగర్ రెడ్డి



మాట్లాడుతూ, గతంలో ఆశ్రమాన్ని చాలాసార్లు సందర్శించినానని, తప్పనిసరిగా ఈ ఆశ్రమానికి మా సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్నిచ్చిందని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో దుబాసి మహేందర్ స్వరూప, కోడిగూటి నరసింహారావు, యాదర కిషన్,పెద్దల శంకర్, సరిగముల రాములు,కల్లేపల్లి ప్రవీణ్, సిరిమల్లె తరుణ్ తేజ,గద్దల సంపత్ ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎస్ జి ఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు %ూ+ఖీ% రాష్ట్రస్థాయి అండర్- 14 & 17 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాలుగా లాభాలు చేకూర్తాయని ముఖ్యంగా వారికి ఎదురవుతున్నటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని, క్రీడల ద్వారా విద్యార్థులు ఖ్యాతి గడిస్తారని అభిప్రాయం



చెప్పారు
ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ లో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందినటువంటి బి సిద్ధార్థ, బీ.రణధీర్, టీ.ముగ్ధ ఎస్. జస్టిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని తెలిపారు.జగిత్యాలలో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో సిహెచ్.రియాన్స్, టి.సాయి అక్షిత్, పి.సహస్ర,బి.మృనాలి, విధాత్రి, జి. సంకృతి ఎంపికైనారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ విజయాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్న సుడా చైర్మన్

- అర్హులైన చివరి లబ్ధి దారుని వరకు ఇళ్లు మంజూరు చేస్తాం
- ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం . సుడా చైర్మన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23**



కొత్తపల్లి హవేలీ లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.కొత్తపల్లిలో మొత్తం 181 ఇళ్లు మంజూరు కాగా15 ఇళ్లకు నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంకా మిగిలిపోయిన అర్హులకు కూడా మంజూరు చేస్తామని స్థానిక నాయకులు వెంటనే మిగిలిపోయిన లబ్ధిదారుల జాబితా తయారు చేసి సంభందిత పత్రాలు ఇవ్వాలని సూచించారు.అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, వార్డ్ ఆఫీసర్లు,అబ్దుల్ అలీ, నర్సయ్య,గడ్డం శ్రీనివాస్,దుబ్బసి కుమార్,చిల్క హనుమత్ రెడ్డి,ఎర్రం కనకరెడ్డి,యస్వడా రాజు,జేరిపోతుల వాసు, కుతటి శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ రెడ్డి, బూసా వీరు, గున్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆర్ట్ కాంపిటీషన్ ముంబై వారు గత నెల జాతి స్థాయిలో నిర్వహణ

- 18 గోల్డ్ మెడల్స్ సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.
- వెల్దుర్తిపాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్ రెడ్డి సాంబయ్య

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 23**
రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్ట్ కాంపిటీషన్ ముంబాయి వారు జాతీయస్థాయిలో నిర్వహించినటువంటి రంగోత్స కార్యక్రమం రంగోత్స వ్ సెలబ్రేషన్ఆర్ట్ కాంపిటేషన్ ముంబై వారి ఆధ్వర్యంలో గత నెల క్రితం వెల్దుర్తి లో నిర్వహించారు ఆర్ట్ దీని 18 బంగారు పథకాలు కాంపిటీషన్ యందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి విద్యార్థులు సత్తా చాటారు. దీని యందు 18 బంగారు పథకాలు, పది వెండి పథకాలు, పది కాంస్య పథకాలు సాధించారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యెల్దుర్తి ప్రధానోపాధ్యాయులు విక్రమ్ రెడ్డి, సాంబయ్యలు తెలియజేశారు. పథకాలు సాధించిన విద్యార్థులతో పాటు వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకురాలు జయసుధను ప్రధానోపాధ్యాయులు మరియు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటస్వామి, నరసింహారెడ్డి,రాము, చార్లెస్, పద్మజ,శైలజ,నవనీత, అమూల్య మరియు ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ రంగోత్సవ కార్యక్రమం రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆర్ట్ కాంపిటేషన్ ముంబై వారి ఆధ్వర్యంలో గత నెలలో యెల్దుర్తి యందు నిర్వహించడం జరిగింది.





